క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

హుజూరాబాద్: పట్టణంలో 33కేవీ సబ్ స్టేషన్‌లో మరమ్మతు కారణంగా శనివారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయముంటుందని టౌన్ ఏఈ ఎం.శ్రీనివాస్‌గౌడ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.
గన్నేరువరం: గన్నేరువరం, ఖాసీంపేట గ్రామాల్లోని 33/11 కేవీ విద్యుత్ సబ్ స్టేషన్లలో మరమ్మతు దృష్ట్యా వీటి పరిధిలోని గ్రామాల్లో శనివారం ఉదయం 10 గంటల నుంచి మాధ్యాహ్నం 1 వరకు విద్యుత్ సరఫరా నిలిపేస్తున్నట్లు విద్యుత్ శాఖ ఏఈ ఆంజనేయులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.

నిధులు మంజూరు చేయాలి


బండి సంజయ్‌కుమార్‌కు వినతిపత్రమిచ్చిన బీజేపీ నాయకులు

శంకరపట్నం: గుడాటిపల్లి–మెట్‌పల్లి మట్టి రోడ్డును బీటీ రోడ్డుగా చేపట్టేందుకు కేంద్రం నిధులు మంజూరు చేయాలని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్‌కు శుక్రవారం బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి సమ్మిరెడ్డి, బీజేవైఎం మండల ప్రధాన కార్యదర్శి తిరుపతిరెడ్డి పార్లమెంట్ కార్యాలయంలో వినతిపత్రం అందించారు. మట్టి రోడ్డుతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని మంత్రికి వివరించగా.. నిధులు మంజూరు చేస్తానని హామీ ఇచ్చినట్లు తిరుపతిరెడ్డి తెలిపారు.

డప్పు చాటింపుతో పన్నులు వసూలు

శంకరపట్నం: ముత్తారం గ్రామంలో శుక్రవారం డప్పు చాటింపు చేసి జీపీ సిబ్బంది ఇంటి పన్నులు వసూలు చేశారు. మండలంలోని 27 గ్రామ పంచాయతీల్లో రూ.80లక్షల ఇంటి పన్నుల బకాయిలున్నాయి. ఈనెల 31 లోపు పన్నులు వసూలు చేయాలని, ప్రతిరోజు ఒక్కో గ్రామంలో రూ.10వేలు వసూలు చేయాలని అధికారులు లక్ష్యం విధించారు. మండలవ్యాప్తంగా సిబ్బంది డప్పు కొట్టి పన్నులు వసూలు చేస్తున్నారు. ఈనెలాఖరులోగా ఇంటి పన్నులు వసూలు పూర్తి చేయాలని ఎంపీవో ప్రభాకర్ పేర్కొన్నారు.

రంగాపూర్ గ్రామాన్ని విలీనం చేయొద్దు

హుజూరాబాద్: రంగాపూర్ గ్రామాన్ని హుజూరాబాద్ మున్సిపాలిటీలో విలీనం చేయొద్దంటూ శుక్రవారం ఆ గ్రామ మాజీ సర్పంచ్ బింగి కరుణాకర్ సీఎస్ శాంతకుమారికి వినతిపత్రం సమర్పించారు. గ్రామాన్ని మున్సిపాలిటీలో విలీనం చేస్తే అనేక సమస్యలు ఉత్పన్నమవుతాయని, ముఖ్యంగా ఉపాధిహామీ పథకం కింద ఆధారపడి జీవిస్తున్న కార్మికుల బతుకులు ఆగమవుతాయన్నారు.

ఎల్ఆర్ఎస్‌లో 25 శాతం రాయితీ

చొప్పదండి: అనుమతి లేని ప్లాట్లను రెగ్యులర్ చేసుకునేందుకు ప్రభుత్వం చేపట్టిన ఎల్ఆర్ఎస్‌ను పట్టణ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ కీర్తి నాగరాజు కోరారు. శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ.. ఈనెల 31 లోగా ఎల్ఆర్ఎస్ రిజిస్ట్రేషన్ చేసుకున్న దరఖాస్తుదారులు ఖాళీ ప్లాట్లను రెగ్యులరైజ్ చేసుకోవాలని సూచించారు. గడువు లోగా ఎల్ఆర్ఎస్ ఫీజు చెల్లించేవారికి 25 శాతం రాయితీ వర్తిస్తుందని తెలిపారు.
జమ్మికుంట: జమ్మికుంట మున్సిపల్ పరిధిలో రాష్ట్ర ప్రభుత్వం అనుమతి లేని ప్లాట్, లేఅవుట్లను ఎల్ఆర్ఎస్ ద్వారా క్రమబద్ధీకరణకు రాయితీ కల్పిస్తోందని జమ్మికుంట మున్సిపల్ కమిషనర్ ఎండీ అయాజ్ అన్నారు. శుక్రవారం విలేకర్లతో మాట్లాడుతూ.. మార్చి 31 లోగా క్రమబద్ధీకరణ ఫీజు 25 శాతం రాయితీ జీవో జారీ చేసిందన్నారు.

పారితోషికం అందజేయాలి

రామడుగు: గతేడాది రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన ఇంటింటి సమగ్ర సర్వే కార్యక్రమంలో పాల్గొన్న సర్వేయర్లకు ఐదు నెలలు కావస్తున్నా నేటికి పారితోషికం అందజేయాలని సమగ్ర సర్వే కార్యక్రమంలో పాల్గొన్న రుద్రారం పాఠశాల క్రాఫ్ట్ టీచర్ ప్రభాకర్ కోరారు.

నిరుపేద విద్యార్థులకు సైకిళ్లు పంపిణీ

చొప్పదండి: పట్టణంలోని జిల్లాపరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో నిరుపేద విద్యార్థినులను గుర్తించి వుమెన్ డెవలప్‌మెంట్ వెల్ఫేర్ సొసైటీ ప్రతినిధులు సైకిళ్లు పంపిణీ చేశారు. పాఠశాలలోని 18 మంది విద్యార్థినులకు శుక్రవారం పాఠశాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో సంస్థ ప్రధాన కార్యదర్శి ఎ.జమున, ప్రవీణ్ విద్యార్థుల తల్లిదండ్రుల సమక్షంలో లేడి బర్డ్ సైకిళ్లను అందించారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

మానకొండూర్: అన్నారం గ్రామంలో జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకంలో రూ.15లక్షలతో చేపట్టే సీసీ రోడ్డు పనులను శుక్రవారం కాంగ్రెస్ పార్టీ నాయకులు ప్రారంభించారు. బందెల మహేందర్, రామగిరి సంతోష్, స్వామి, లక్ష్మయ్య, రాజయ్య, రామస్వామి, రాసకొండ శ్రీను, ఉపాధిహామీ సిబ్బంది పాల్గొన్నారు.



బెల్లం పానకం రంగులో నల్లా నీరు

చొప్పదండి: పట్టణంలోని గణేశ్‌నగర్‌లో రంగు మారిన నల్లా నీరు రావడంపై స్థానికులు మున్సిపాలిటీలో ఫిర్యాదు చేశారు. ఉదయాన్నే ఇళ్లలో వివిధ అవసరాల కోసం నల్లా నీరు పట్టగా.. బెల్లం పానకం రంగులో నీళ్లు వచ్చాయని ఆందోళన వ్యక్తం చేశారు. కాలనీవాసులు అనారోగ్యం బారిన పడే అవకాశమున్నందున నీటి సరఫరాలోని లోపాలను నివారించి స్వచ్ఛమైన మున్సిపల్ నీరు సరఫరా అయ్యేలా చూడాలని, చర్యలు తీసుకోవాలని స్థానిక బీఆర్ఎస్ నాయకుడు కొక్కుల రామ్మోహన్ మున్సిపల్ కమిషనర్ నాగరాజుకు ఫిర్యాదు చేశారు.



మంచినీటి కోసం నిరసన

గంగాధర: రెండు రోజులుగా మంచినీటి సరఫరా లేక తాగునీటికి తంటాలు పడుతున్నామని, వెంటనే సమస్యను పరిష్కరించాలని మహిళలు ఖాళీ బిందెలతో రోడ్డెక్కారు. సర్వారెడ్డిపల్లి గ్రామంలోని ఎస్సీకాలనీకి రెండు రోజులుగా నీటి సరఫరా నిలిచిపోయింది. సమస్యపై అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదన్నారు.

పైకప్పు లేని నీటి ట్యాంకు



శంకరపట్నం: మొలంగూర్ బస్టాండ్ వద్ద మినీ నీటి ట్యాంకుకు పైకప్పు లేకపోవడంతో కోతులు ట్యాంకు లోకి దిగుతున్నాయని గ్రామస్తులు ఆరోపించారు. ప్రయాణికులతోపాటు చుట్టుపక్కల హోటళ్లు, చిరు దుకాణాదారులు ట్యాంక్ నీరు తాగలేకపోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. పైకప్పు ఏర్పాటు చేయాలని కార్యదర్శికి మొర పెట్టుకున్నా పట్టించుకోవడం లేదన్నారు.

పైపులైన్ లీకేజీకి మరమ్మతు

సాక్షి స్పందన



శంకరపట్నం: కేశవపట్నం గ్రామంలో శుక్రవారం పైపులైన్ లీకేజీ మరమ్మతు పనులను కూలీలతో జీపీ సిబ్బంది చేపట్టారు. గ్రామంలో తాగునీటి పైపులైన్ లీకేజవుతున్న కథనం శుక్రవారం సాక్షిలో ప్రచురితమైంది. స్పందించిన కార్యదర్శి నర్సయ్య కూలీలతో తాగునీటి పైపులైన్ మరమ్మతు చేయించి తాగునీరు సరఫరా చేయించారు.


హుజూరాబాద్ ప్రభుత్వ కళాశాలలో కేక్ కట్ చేస్తున్న అధ్యాపకులు


జమ్మికుంట: ఉపాధ్యాయురాలిని సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

ముందస్తు మహిళా దినోత్సవం

హుజూరాబాద్: పట్టణంలోని పలు ప్రభుత్వ, ప్రైవేట్ విద్యాసంస్థల్లో శుక్రవారం మహిళా ఉద్యోగులు, ఉపాధ్యాయులు ముందస్తు మహిళా దినోత్సవం నిర్వహించారు. కేక్ కట్ చేసి మిఠాయిలు పంచి పెట్టారు.
చొప్పదండి: రుక్మాపూర్ జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించారు. హెచ్ఎం శ్రీధర్ ఆధ్వర్యంలో మహిళా ఉపాధ్యాయులు, మహిళా వంట మనిషిని సన్మానించారు. మెమెంటోలు అందించారు. సంగనభట్ల సురేందర్, సముద్రాల అంజయ్య, బండపల్లి మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు. సావిత్రిబాయి అవార్డు గ్రహీత తాళ్లపల్లి సుజాత, చొప్పదండి పీహెచ్‌సీకి చెందిన డాక్టర్ శ్రీకీర్తన, హెల్త్ సూపర్‌వైజర్ శ్రీదేవిలను సన్మానించారు.
జమ్మికుంట: పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ, పీజీ కళాశాల ప్రిన్సిపాల్ డా.రమేశ్ అధ్యక్షతన మహిళ సాధికారత విభాగం కన్వీనర్ డా.శ్యామల, పట్టణంలోని ఎంఈవో కార్యాలయంలో ఎంఈవో హేమలత ఆధ్వర్యంలో నిర్వహించారు.

న్యాయం చేయాలని కుటుంబ సభ్యుల ఆందోళన



హుజూరాబాద్: పెళ్లి ఊరేగింపు సంఘటనలో గాయపడి మృతిచెందిన బాకారపు ఉమ కుటుంబానికి న్యాయం చేయాలని కోరుతూ శుక్రవారం కుటుంబ సభ్యులు, బంధువులు నిరసన వ్యక్తం చేశారు. వారి వివరాల ప్రకారం.. మెట్‌పల్లి గ్రామంలో ప్రభాకర్ అనే వ్యక్తి కుమార్తె వివాహం జరిగింది. పెళ్లి అనంతరం భరాత్ జరుగుతుండగా.. కారు డ్రైవర్ భరాత్ చూస్తున్న ఉమ, ఆమె కుమార్తె నిఖితలను ఢీకొట్టారు. ఉమకు తీవ్ర గాయాలు కాగా.. చికిత్స నిమిత్తం వరంగల్ ఎంజీఎంకు తరలించారు. పరిస్థితి విషమించడంతో హైదరాబాద్‌కు తరలిస్తున్న క్రమంలో మార్గమధ్యలో మృతిచెందింది. ఉమ మృతదేహాన్ని హుజూరాబాద్ ఏరియా ఆసుపత్రికి తరలించారు. ప్రమాదానికి కారణమైన డ్రైవర్, పెళ్లి వారు స్పందించడం లేదని, ఈ సంఘటనలో ఒక మహిళ ప్రాణం పోయినా పట్టించుకోని వారిపై చర్యలు తీసుకోవాలంటూ ఆసుపత్రి ముందు ఆందోళన నిర్వహించారు. దీంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం కలిగింది. సీఐ తిరుమల్‌గౌడ్ బాధితులతో మాట్లాడి న్యాయం చేస్తానని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.


సీఐటీయూ నాయకులు, కార్మికుల నిరసన

పెండింగ్ జీతాలు చెల్లించాలి

హుజూరాబాద్: ఎంపీడీవో కార్యాలయం ఎదుట సీఐటీయూ గ్రామ పంచాయతీ యూనియన్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి కొప్పుల శంకర్ మాట్లాడుతూ.. మండలంలోని వివిధ గ్రామాల్లో పెండింగ్‌లో ఉన్న జీతాలను వెంటనే చెల్లించాలన్నారు. పంచాయతీ కార్మికులకు గ్రీన్ చానల్ ద్వారా నేరుగా అకౌంట్లో వేతనాలు చెల్లిస్తామని ప్రభుత్వం ప్రకటించి మూడు నెలలు గడుస్తున్నా ఇప్పటికీ వేతనాలు అందించకపోవడంతో కుటుంబాలను పోషించుకోవడం ఇబ్బందవుతోందన్నారు. నాయకులు కదిరి రమేశ్, మైపాల్, గుగ్గిళ్ల రాములు, అడపు అరవింద్, ఇమ్మడి రాజు, శ్రీకాంత్, అభిలాశ్, చిరంజీవి, ఉమ, లింగయ్య, విమల కోమల తదితరులున్నారు.
జమ్మికుంట: ఎంపీడీవో కార్యాలయం ఎదుట మండలంలోని గ్రామ పంచాయతీ కార్మికులు ధర్నా నిర్వహించారు. పెండింగ్‌లో ఉన్న నాలుగు నెలల వేతనాలను చెల్లించాలన్నారు. ఎంపీడీవో భీమేశ్‌కు వినతిపత్రం అందించారు. ఎండిగా రవీందర్‌రావు, లద్దునూరి కుమార్, మేకమల్ల రాము, సంపత్, వాసాల సారయ్య, సంజీవ్, రవి, రాజు, కొమురయ్య, రాజు, తిరుపతి, ఉమ, వనిత, అలీమా, స్వప్న, రాజమణి తదితరులు పాల్గొన్నారు.

సహకార సంఘాలకు ప్రత్యేక అధికారులు

శంకరపట్నం: మెట్‌పల్లి, గద్దపాక సహకార సంఘాల పదవీకాలం ముగియడంతో శుక్రవారం ప్రత్యేక అధికారులు బాధ్యతలు స్వీకరించారు. సహకార సంఘం అసిస్టెంట్ సబ్ రిజిస్ట్రార్ అశోక్ కుమార్ మెట్‌పల్లి సహకార సంఘం ప్రత్యేక అధికారిగా బాధ్యతలు స్వీకరించినట్లు సీఈవో సదయ్య తెలిపారు. గద్దపాక సహకార సంఘం ప్రత్యేక అధికారిగా చారి బాధ్యతలు చేపట్టినట్లు సీఈవో శ్రీనివాస్ పేర్కొన్నారు.

ఎల్లమ్మ, పోచమ్మ ఆలయాల్లో చోరీ



శంకరపట్నం: మొలంగూర్ గ్రామంలోని ఎల్లమ్మ, పోచమ్మ ఆలయాల్లో చోరీ జరిగింది. గురువారం గ్రామస్తులు గ్రామ దేవతలను పూజించి ఆలయాలకు తాళాలు వేశారు. శుక్రవారం తెల్లవారుజామున ఆలయాల్లోకి వెళ్లిన గ్రామస్తులకు తాళాలు, హుండీ పగలగొట్టి ఉండడం గమనించారు. గతంలో దొంగతనాలు జరగడంతో దేవతలకు సంబంధించి ఆభరణాలను కమిటీ బాధ్యులు భద్రపర్చారు. భక్తులు హుండీలో వేసిన కానుకలను దొంగలు దోచుకెళ్లారని గ్రామస్తులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

హుజూరాబాద్: పట్టణంలోని జమ్మికుంట రోడ్డులో శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలయ్యాయి. అతివేగంగా వస్తున్న ట్రాక్టర్ రోడ్డు పక్కన ఆగి ఉన్న మోటార్ సైకిల్, పక్కనే ఉన్న పాఠశాల గోడను ఢీకొట్టింది. గోడ పిల్లర్ ధ్వంసమైంది. మోటార్ సైకిల్‌పై ఉన్న ఇద్దరు వ్యక్తులు ఎగిరి పడ్డారు. బైక్‌పై ప్రయాణిస్తున్న యాకూబ్‌కు తీవ్ర గాయాలు కాగా.. ముజాహిద్‌కు స్వల్ప గాయాలయ్యాయి. యాకూబ్‌కు 108లో ప్రథమ చికిత్స అనంతరం జమ్మికుంటలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో శస్త్ర చికిత్స జరిపారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఒకరి అరెస్ట్

చొప్పదండి: పట్టణంలోని శ్రీరామ ఇంజనీరింగ్ గోదాములో కాపర్ తీగ చోరీ చేసిన ఘటనలో మరో నిందితుడిని పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఎస్ఐ గొల్లపల్లి అనూష కథనం ప్రకారం.. ఈనెల 4న గోదాములోని కాపర్ వైరు చోరీకి గురి కాగా.. పోలీసుల విచారణలో భాగంగా ఇప్పటికే గోగులకొండ మహేశ్, కడారి అభిషేక్‌లను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. చోరీ చేసిన కాపర్ వైర్‌లో వంద కిలోల వరకు అమ్మగా, మిగతా పది కిలోలు తన వద్దే ఉండటంతో శివ దానిని తరలించేందుకు ప్రయత్నిస్తూ పోలీసులకు పట్టుబడ్డాడు. మెజిస్ట్రేట్ నిందితుడికి 14 రోజుల రిమాండ్ విధించినట్లు తెలిపారు. 60 కిలోల కాపర్ వైరు, సెల్ ఫోన్ సీజ్ చేయడంలో కృషి చేసిన ఎస్ఐ అనూష, హెడ్ కానిస్టేబుళ్లు రాజేశ్వర్‌రావు, శ్రీనివాస్‌రెడ్డి, కానిస్టేబుళ్లు శ్రీధర్, ఖలీపా, భార్గవ్‌లను సీపీ అభిషేక్ మహంతి అభినందించారు.

హైనా దాడిలో లేగదూడ మృతి



చిగురుమామిడి: సుందరగిరి గ్రామంలో హైనా దాడిలో లేగదూడ మృతిచెందింది. బాధిత రైతు వివరాల ప్రకారం.. రోజువారీ మాదిరిగానే గురువారం సాయంత్రం వ్యవసాయ బావి వద్ద పశువుల పాకలో ఆవుతోపాటు లేగదూడను కట్టేసి మేత వేసి వచ్చాడు. శుక్రవారం ఉదయం వేకువజామున ఐదు గంటల ప్రాంతంలో వెళ్లి చూడగా.. లేగదూడ హైనా దాడిలో మృతిచెంది ఉందని బాధిత రైతు జీల మల్లేశ్‌యాదవ్ వాపోయాడు. 18 నెలల వయస్సు గల లేగదూడ మృతిచెందడం ఎంతో బాధగా ఉందని, అది పెరిగి పెద్దదైతే రూ.50వేల విలువ ఉండేదన్నారు. చిగురుమామిడి పశు వైద్యాధికారి సాంబరావు, ఫారెస్టు అధికారి శేఖర్ ఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు.

పలువురిపై కేసు

రామడుగు: కోరటపల్లి గ్రామానికి చెందిన నెల్లి పద్మ భర్త శంకరయ్య అన్నలు నెల్లి కనకయ్య, నెల్లి రవి, ఆడపడుచులు పిట్టల సుగుణ, పోచవ్వ, రాజేశ్వరి దాడి చేయడంతో రామడుగు పోలీసులు కేసు నమోదు చేశారు. పద్మకు చెందిన భూమిని అక్రమంగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని ఆమె ఇంట్లో చొరబడ్డారు. పద్మ, తన భర్త శంకరయ్యలను తిడుతూ గొంతు నులిమినట్లు బాధితురాలి ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

మృతుడి కుటుంబాన్ని ఆదుకోవాలి

గన్నేరువరం: ఇటీవల తాటి చెట్టు నుంచి కింద పడి మృతిచెందిన జంగపల్లి గ్రామ గీత కార్మికుడు ముత్యం ధర్మయ్యగౌడ్ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని గౌడ సంఘం మండల అధ్యక్షుడు బుర్ర తిరుపతిగౌడ్ కోరారు. శుక్రవారం మృతుడి కుటుంబాన్ని పరామర్శించి 50 కిలోల బియ్యం అందజేశారు. న్యాలపట్ల రవికుమార్‌గౌడ్, బుర్ర కనకయ్యగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలకు పరామర్శ

చొప్పదండి: చిట్యాలపల్లి, భూపాలపట్నం గ్రామాలకు చెందిన కొండపర్తి అరుణ్‌కుమార్, నాంపెల్లి అలేఖ్య రెండు రోజుల క్రితం కరీంనగర్‌లో ఆత్మహత్యకు పాల్పడగా.. శుక్రవారం ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం మృతుల కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఇటీవల చొప్పదండిలో రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన రాగంపేటకు చెందిన హోటల్ కార్మికుడు వొడ్నాల రమేశ్ కుటుంబ సభ్యులను పరామర్శించి రూ.5వేల ఆర్థిక సాయం అందించారు.

నిందితులను కఠినంగా శిక్షించాలి

హుజూరాబాద్: జగిత్యాల జిల్లా సారంగాపూర్ మండలం నగునూర్ గ్రామంలో అంబేడ్కర్ విగ్రహానికి చెప్పుల దండ వేసి అవమానపరిచిన దుండగులను గుర్తించి వారిని కఠినంగా శిక్షించాలని ధర్మ సమాజ్ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి మందరాజు మహారాజ్ శుక్రవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు.



మానకొండూర్ రూరల్: వెల్ది–లక్ష్మీపూర్ గ్రామాల మధ్య ఇసుక ట్రాక్టర్లతో రోడ్డు గుంతలమయమైంది. పలుచోట్ల భారీ గుంతలు కావడంతో వాహనదారులు, ప్రయాణికులు ప్రమాదాల బారిన పడుతున్నారు. అధికారులు, నాయకులు చర్యలు చేపట్టి రోడ్డు బాగు చేయాలని మండల ప్రజలు కోరుతున్నారు.

సమస్య పరిష్కారానికి సంప్రదించాల్సిన అధికారి
రాజశేఖర్, ఏఈ, ఆర్అండ్‌బీ, సెల్ నం.: 9440818867

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటి నుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది.

మా ఫోన్ నంబర్లు: 9393557752, 9848408781, 8790144227

ఉపాధిహామీ పనుల్లో అవకతవకలు జరగొద్దు


సామాజిక తనిఖీ సమావేశం

గంగాధర: గ్రామాల్లో చేపట్టే ఉపాధిహామీ పనుల్లో అవకతవకలు జరగకుండా చూసుకోవాలని పంచాయతీ కార్యదర్శులు, ఉపాధిహామీ సిబ్బందికి డీఆర్డీవో పీడీ శ్రీధర్ సూచించారు. మండల కేంద్రంలో శుక్రవారం 15వ సామాజిక తనిఖీ ప్రజావేదిక సమావేశం నిర్వహించారు. మండలంలోని 33 గ్రామ పంచాయతీల్లో ఉపాధిహామీ పథకంలో చేపట్టిన అభివృద్ధి పనులకు సంబంధించి సామాజిక తనిఖీ నివేదికలను చదివి వినిపించారు. ఉపాధి హామీ పథకంలో నాటిన కొన్ని మొక్కలు చనిపోయినట్లు, తవ్విన కాలువలను రైతులు పూడ్చివేసినట్లు, కొన్నిచోట్ల రైతులు నాటిన మొక్కలను పీకేశారని వివరించారు. రూ.1,11,202 రికవరీకి అధికారులు ఆదేశించారు. ఏపీడీ కృష్ణ, జిల్లా విజిలెన్స్ అధికారి వెంకటేశ్వర్లు, క్వాలిటీ కంట్రోల్ ఆఫీసర్ శ్రీనివాస్, ఎంపీడీవో రాము, ఎస్సార్పీ రవి, ఏపీవో సత్యప్రకాశ్, ఉపాధిహామీ సిబ్బంది పాల్గొన్నారు.

స్వల్పంగా పెరిగిన పత్తి ధర


వేలం పాటలో పాల్గొన్న వ్యాపారులు

జమ్మికుంట: జమ్మికుంట వ్యవసాయ పత్తి మార్కెట్‌లో పత్తి ధర స్వల్పంగా పెరిగింది. గురువారం క్వింటాల్ పత్తి ధర రూ.7,050 కాగా.. రూ.100 పెరిగి క్వింటాల్ పత్తి ధర గరిష్టంగా రూ.7,150 పలికింది. శుక్రవారం మార్కెట్‌కు 22 వాహనాల్లో 242 క్వింటాల పత్తిని రైతులు అమ్మకానికి తీసుకొచ్చారు. క్వింటాల్‌కు మోడల్ ధర రూ.7,100, కనిష్ట ధర రూ.6,900కు ప్రైవేటు వ్యాపారులు కొనుగోలు చేశారు. శని, ఆదివారాలు సాధారణ సెలవులుంటాయని, సోమవారం యధావిధిగా క్రయవిక్రయాలు ప్రారంభమౌతాయని ఉన్నత శ్రేణి కార్యదర్శి మల్లేశం, గ్రేడ్–2 కార్యదర్శి రాజాలు తెలిపారు. క్రయవిక్రయాలను మార్కెట్ చైర్‌పర్సన్ పూల్లూరి స్వప్నసదానందం పర్యవేక్షించారు.

జనరిక్ మందులు నాణ్యమైనవి


మాట్లాడుతున్న డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ చందు

హుజూరాబాద్: జనరిక్ మందులు నాణ్యమైనవని, తక్కువ ధరలో లభిస్తాయని హుజూరాబాద్ డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ చందు అన్నారు. చెల్పూర్ గ్రామంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో జాతీయ జన ఔషధి దినోత్సవం నిర్వహించారు. దేశమంతటా జనరిక్ మందుల దుకాణాలున్నాయన్నారు. వైద్యాధికారి డాక్టర్ మధు, జిల్లా హెల్త్ ఎడ్యుకేటర్ పంజాల ప్రతాప్, ఎంపీహెచ్‌వో విజయేందర్‌రెడ్డి, ఆరోగ్య సిబ్బంది, గ్రామస్తులున్నారు.
జమ్మికుంట: వావిలాల పీహెచ్‌సీ వైద్యాధికారి డా.రాజేశ్ ఆధ్వర్యంలో పీహెచ్‌సీ పరిధిలో ఆరోగ్య ఉప కేంద్రాల వైద్యులు సిబ్బంది, ప్రజలకు జన ఔషధి దివాస్(జనరిక్ ఔషధాలు) పురస్కరించుకొని శుక్రవారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆరోగ్య ఉప కేంద్రాల వైద్యులు మహోన్నతపటేల్, సంధ్యారాణి, హిమబిందు, ఫరహానుద్దీన్, కార్తీక్, సంధ్య, విజయ్‌కుమార్, హెల్త్ ఎడ్యుకేటర్ మోహన్‌రెడ్డి, సూపర్‌వైజర్లు అరుణ, రత్నకుమారి, సదానందం, దేవేందర్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

అంగన్‌వాడీ సేవలు సద్వినియోగం చేసుకోవాలి


గన్నేరువరంలో మాట్లాడుతున్న సీడీపీవో శ్రీమతి

గంగాధర: గ్రామాల్లో అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు అందిస్తున్న సేవలను అర్హులందరూ సద్వినియోగం చేసుకోవాలని ఐసీడీఎస్ సీడీపీవో నర్సింగరాణి సూచించారు. గోపాల్‌రావుపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో తల్లులు, గర్భిణులు, బాలింతలతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. షుగర్ బోర్డు, ఆరోగ్య మహిళపై వివరించారు. సూపర్‌వైజర్ రేణుక, బీసీ శ్రీధర్, అంగన్‌వాడీ టీచర్ అరుణ తదితరులు పాల్గొన్నారు.
గన్నేరువరం: మహిళల ఆరోగ్యం కోసమే ప్రతి శుక్రవారం అంగన్‌వాడీ కేంద్రాల్లో శుక్రవారం సభ నిర్వహిస్తున్నట్లు ఐసీడీఎస్ సీడీపీవో శ్రీమతి తెలిపారు. గన్నేరువరంలోని మూడో అంగన్‌వాడీ కేంద్రంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో శుక్రవారం సభ నిర్వహించారు. డీఎల్‌పీవో హరికిషన్, ఇన్‌చార్జి ఎంపీడీవో శ్రీనివాస్, సూపర్‌వైజర్ కవిత, కార్యదర్శి వెంకట్‌రెడ్డి, ప్రణీత, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.
శంకరపట్నం: గద్దపాక, కేశవపట్నం అంగన్‌వాడీ కేంద్రాల్లో శుక్రవారం సభలు జరిగాయి. ఆరోగ్య మహిళా కార్యక్రమాన్ని మహిళలు సద్వినియోగం చేసుకోవాలని ఐసీడీఎస్ అధికారులు సూచించారు.

పైపులు ధ్వంసం.. నీరు వృథా



శంకరపట్నం: ఇది పొంటీన్ కాదు.. మిషన్ భగీరథ పైపులు లీకేజీ ఏర్పడి తాగు నీరు ఎగిసిపడుతోంది. వంకాయగూడెం గ్రామ శివారులో శుక్రవారం మిషన్ భగీరథ పైపులు పగిలి నీరంతా పంట పొలాల్లోకి వెళ్లింది.

ఇంటర్ పరీక్షలు ప్రశాంతం

జమ్మికుంట: పట్టణంలో ఇంటర్ మొదటి సంవత్సరం పరీక్షలు ప్రశాంతంగా జరిగాయని విశ్వనాథ్‌రెడ్డి శుక్రవారం తెలిపారు. మూడు కేంద్రాల్లో 724 మంది విద్యార్థులకు 665 మంది హాజరయ్యారు.